# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-04-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లాలో పర్యటించి లబ్దిదారులకు పింఛన్ల నగదును పంపిణీ చేశారు.**
2. **విశాఖపట్నంలో భారత్, అమెరికా టైగర్ ట్రయంఫ్ -త్రివిధ దళ విన్యాసాలు ఈరోజు ప్రారంభమైయ్యాయి.**
3. **ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.**
3. **ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.**
4. **రాష్ట్రంలో బయోటెక్నాలజీని ప్రోత్సహించేందుకు సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.**

==========================

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాపట్ల జిల్లాలోని గొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించి లబ్దిదారులకు పింఛన్ల నగదును పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ..

..వాయిస్.. 40 సెకన్లు

మరోవైపు రాష్ట్రంలోని అనంతపురం, చిత్తూరు, పల్నాడు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్యం జిల్లాలోని సాలూరులో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పర్యటించి.. పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...

వాయిస్ ... 33 సెకన్లు

------------------------

విశాఖపట్నంలో భారత్, అమెరికా టైగర్ ట్రయంఫ్ –సైనిక, వైమానిక, నావిక దళాల విన్యాసాలు ఈరోజు నుంచి ప్రారంభమైయ్యాయి. ఇరు దేశాలు మానవతాసాయం, విపత్తుల నిర్వహణ ప్రధాన అంశాలుగా

ఈ సంయుక్త విన్యాసాలను 13 రోజుల పాటు బంగాళాఖాతంలో నిర్వహించనున్నాయని తూర్పు నౌక దళ అధికారి కామాండర్ సుజిత్ రెడ్డి తెలిపారు. పరస్పర సాంకేతిక పరిజ్ఞానం, మెళకువల మార్పిడిలో భాగంగా విన్యాసాలను ఇరుదేశాలు నౌక దళాలు నిర్వహిస్తున్నాయి.

---------------------------

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నూతన బస్సును మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని బస్సు డిపోలకు కొత్త బస్సులను కేటాయిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సుల ద్వారా రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రాంతాలకు విస్తృతమైన రవాణా సౌకర్యాలను కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా భగవాన్రాజుపాలెంలో పింఛన్లను లబ్ధిదారులకు ఈరోజు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. భగవాన్రాజుపాలెంలో కమ్యూనిటీ హాలు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో బయోటెక్నాలజీని ప్రోత్సహించేందుకు సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. మంత్రి సత్యకుమార్ నిన్న కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌తో ఢిల్లీలో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా బయోటెక్నాలజీ సంబంధిత ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ సహకారంపై చర్చించారు. అనంతరం సత్యకుమార్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ... ఆరోగ్య రంగ అభివృద్ధికి బయో టెక్నాలజీ సేవలను ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి వుందని చెప్పారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా రబీ పంట కాలంలో 6 జిల్లాల పరిధిలో 51 కరవు మండలాలను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 37 మండలాల్లో తీవ్రస్థాయిలో, 14 మండలాల్లో మధ్యస్థంగా కరవు ప్రభావం ఉంది. ప్రకాశం జిల్లాలో 17, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో 10 చొప్పున, అనంతపురంలో 7, నంద్యాలలో 5, శ్రీసత్యసాయి జిల్లాలో 2 కరవు మండలాలు ఉన్నాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. లోటు వర్షపాతం, ఎండిపోయిన పంటల పరిస్థితితో పాటు జిల్లా కలెక్టర్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా రెవెన్యూ శాఖ కరవు మండలాలను నిర్ధారించింది. ఆయా ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

---------------------------

కేంద్ర ప్రభుత్వ భారత సంచార నిగమ్ బిఎస్ ఎన్ ఎల్ సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు

లోని మంత్రి కార్యాలయంలో టెలికాం ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రోవైడర్లు ఆయనతో నిన్న సమావేశమై బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన పలు అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. టెలికాం ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రోవైడర్ల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో చర్చలు జరిపి వాళ్ళకి అందించాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, వెను బిల్లులు చెల్లింపుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కార కోసం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతిలోని జనసేనపార్టీ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన పాత్రికేయులతోమాట్లాడుతూ, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించటంతోపాటు వారి సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో స్వీకరించే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ ... 33 సెకన్లు

---------------------------

విశాఖపట్నం, విజయవాడల్లో వృత్తిపన్ను వసూళ్ళ బాధ్యతను వాణిజ్య పన్నుల శాఖ చేపట్టనుందని ఆ శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ఈరోజు నుండి అమలులోకి వస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఈ రెండు నగరాల్లో మినహా మిగిలిన చోట్ల వాణిజ్య పన్నుల శాఖ ద్వారానే వృత్తి పన్ను వసూలు జరుగుతోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వృత్తి పన్ను, రిటర్నుల ఫైలింగ్ కోసం కొత్తగా రూపొంధించిన ఆన్‌లైన్ మాడ్యూల్ ఈరోజు నుండి అందుబాటులోకి వస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వ్యవసాయ చెరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ కోరారు. జిల్లాలోని కొమరాడ మండలం విక్రంపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కింద చేపడుతున్న పలు పనులను కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సాగుభూమిని సారవంతం చేయడంలో, రైతులు బహుళ పంటలను సాగు చేసేందుకు ఫారం పాండ్స్ ఎంతగానో సహాయ పడతాయని చెప్పారు. సాగు నీటి కొరతను తగ్గించడం పంటల దిగుబడిని పెంచడంతో పాటు, రైతుల ఆదాయాన్ని పెంచడమే వీటి లక్ష్యమని కలెక్టర్ వివరించారు.

======================